ప్రజాశక్తి
సోమవారం 21 ఆగస్టు 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉప ఎన్నికల్లో వైసిపికి ప్రతికూలత

- రెండు సర్పంచ్ స్థానాల్లోనూ టిడిపి బలపరిచిన అభ్యర్థులే గెలుపు
- పల్లెల్లో అధికారపార్టీపై పెరుగుతున్న అసంతృప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో శనివారం జరిగిన పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల ఫలితాల్లో స్థానిక అసంతృప్తి వ్యక్తమైంది. వార్డు మెంబర్లలో అధికార పార్టీకి చెందిన వారు ఎక్కువ మంది గెలిచినప్పటికీ, చెప్పుకోదగిన ఓట్ల తేడాతో ఆ విజయం లేదు. వార్డులో ఓటర్లు తక్కువైనా అధికార పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని ఆ పార్టీ నాయకత్వం ఊహించినా.. ఫలితాల్లో అవి ప్రతిబింభించలేదు. రెండు పంచాయతీ సర్పంచ్, 26 వార్డులకు శనివారం ఎన్నికలు జరగాల్సివుంది. వీటిలో బుచ్చెయ్యపేట సర్పంచ్, 16 వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఎస్.రాయవరం మండలంలోని కొరుప్రోలు సర్పంచ్, మరో ఎనిమిది వార్డు సభ్యులకు ఎన్నిక జరిగింది. రాంబిల్లి మండలంలోని కొప్పుగొండపాలెం పంచాయతీ లోని 9, 10 వార్డులకు నామినేషన్ వేయకపోవడంతో ఎన్నిక జరగలేదు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కాలంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు అధికార పార్టీకి ప్రతికూలంగా రావడంతో ఆ పార్టీ నాయకత్వం ఆందోళనకు గురవుతోంది. వార్డు సభ్యుల గెలుపు కంటే రెండు సర్పంచ్ పదవులు టిడిపి ఖాతాలో జమయ్యాయి. గతంలో కొరుప్రోలు సర్పంచ్ లోవలక్ష్మి వైసిపి మద్దతుతో గెలిచింది. ఆమె మరణంతో శనివారం జరిగిన ఎన్నికల్లో సర్పంచ్ స్థానం వైసిపి కోల్పోయింది. టిడిపికి చెందిన కర్రి సూరివేణి విజయం సాధించింది.

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రాతినిధ్యం వహిస్తున్న చోడవరం నియోజక వర్గంలోని బుచ్చెయ్యపేట మండలంలోని బుచ్చెయ్యపేట పంచాయతీ సర్పంచ్‌గా గతంలో టిడిపి మద్దతుదారు సుంకర సూరిబాబు గెలుపొందారు. ఆయన మృతితో అతని భార్య సుంకర లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్.రాయవరం మిగతా 2లో..

క్షతగాత్రున్ని వైద్యం కోసం విశాఖకు తీసుకొచ్చిన సిబ్బంది

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 6లో..

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

- లోయలో పడిన బస్సు - ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

కంటైనర్ బిజినెస్‌లో అగ్రగామిగా కాంకర్

- ఎగుమతి, దిగుమతి వ్యాపారంలో అనూహ్య ప్రగతి
- ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి
- స్టీల్‌ప్లాంట్, పోర్టు, ఎన్‌టిపిసి, ప్రైవేట్ సంస్థలతో ఎగ్జిమ్ సమన్వయం
- 'ప్రజాశక్తి'తో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్) జనరల్ మేనేజర్ కిశోర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్).. దేశంలోనే 60 టర్మినల్స్ కలిగి ఉండి జాతీయ ఆర్థిక పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. దేశం లోపల, బయటా కంటైనర్ బిజినెస్ (ఎగ్జిమ్) నిర్వహణలో అగ్రగామి సంస్థగా ఇది వెలుగొందుతోంది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఎదురుగా జాతీయ రహదారికి ఆనుకుని నగరం నడిబొడ్డున 108 ఎకరాల్లో అత్యుత్తమ మౌలిక వసతులు కలిగిన సంస్థ ఇది. 2017లో స్థానికంగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు (ఎంఎంఎల్‌టి) ప్రారంభమైంది. రెండు లక్షల చదరపు అడుగుల వేర్ హౌసింగ్ సౌకర్యం ఈ లాజిస్టిక్ పార్కులో ప్రత్యేకత. రైలు, రోడ్డు మార్గంలో కంటైనర్ బిజినెస్‌లో కొన్ని సంవత్సరాలుగా అనూహ్య ప్రగతిని కాంకర్ సాధిస్తోంది' అని కాంకర్ జనరల్ మేనేజర్ (జిఎం, ఐఆర్‌ఎస్ఇ) కెవిఎస్ఆర్‌కె.కిశోర్ వెల్లడించారు. 'ప్రజాశక్తి'తో ఆయన ముచ్చటిస్తూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కంటైనర్ ట్రాఫిక్ ఎలా ఉంది ? ఈ బిజినెస్‌లో ఏయే ఉత్పత్తులు ప్రధానంగా ఉంటాయి?

కంటైనర్ ట్రాఫిక్ చాలా బాగుంది. గతంలో రైస్ ఎగుమతి బల్కర్‌లో వెళ్లేది. నేడు వెస్సెల్స్‌లో కంటైనర్‌లో పంపుతున్నాం. బిజినెస్ బాగా పెరిగింది. 2022 -2023లో కాంకర్ 64 వేల టిఇయులు దేశం బయట కంటైనర్ కార్గో చేసింది. దేశీయంగా 9 వేల టిఇయులు చేశాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నాన్ డొమెస్టిక్‌ను లక్ష టిఇయులకు పెంచనున్నాం. డొమెస్టిక్ కంటైనర్‌ను 14 వేల టిఇయులకు పెంచబోతున్నాం.

కాంకర్ టర్మినల్‌లో ఉన్న వసతులేమిటి ?

ఇక్కడ టర్మినల్ విశాలమైన ప్రదేశంలో కంటైనర్ బిజినెస్‌కు అనుకూలంగా ఏర్పాటు చేయబడింది. కంటైనర్ మిగతా 2లో..

పంచ గ్రామాల సమస్యపై ధర్నా

వార్త 4లో..

మొదటి పేజీ తరువాయి..

ఉప ఎన్నికల్లో వైసిపికి ప్రతికూలత

మండలం కొరుప్రోలు పంచాయతీ సర్పంచ్ ఎన్నికలో టిడిపి మద్దతుదారు సూరివేణి గెలిచారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనకాపల్లి మినహా చోడవరం, యలమంచిలి, వి.మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, పెందుర్తి నియోజకవర్గంలోని 24 వార్డులకు, రెండు సర్పంచ్ పదవులకు జరిగిన ఎన్నికల ఫలితాలు చర్చకు దారితీశాయి.

వైసిపి పట్ల గ్రామాల్లో వ్యతిరేకత పెరుగుతుందన్న అంచనాలో టిడిపి నాయకత్వం వుంది. మరోవైపు స్థానిక ఎన్నికల ప్రతికూల ఫలితాలు రాబోయే సాధారణ ఎన్నికలపై ఎటువంటి ప్రభావమూ చూపబోవని అధికార పార్టీ నాయకులు కొట్టిపారేస్తున్నారు.

కంటైనర్ బిజినెస్‌లో అగ్రగామిగా కాంకర్

ఎగుమతి, దిగుమతులకు అవసరమైన ఉన్నతమైన మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. 24 గంటలూ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా కంటైనర్ కార్గో హ్యాండ్లింగ్ పూర్తిగా సిసి టీవీల నిఘాలో ఉంటుంది. కాబట్టి హేండ్లింగ్‌లో సరుకు తప్పురణ శాతం జీరో. పర్యావరణహిత కార్గో కూడా కాంకర్ ప్రత్యేకత.

కాంకర్ బిజినెస్‌కు ప్రధాన బూస్టింగ్ ఏమిటి ?

రైల్వే కనెక్టివిటీ ఉంది. నేరుగా జాతీయ రహదారికి ఆనుకుని, నగరంలోని ఎయిర్‌పోర్టుకు దగ్గరగా ఉండటంతో బిజినెస్ బూస్టింగ్‌కు ఒక కారణం. 8 రైల్వే లైన్‌లుండగా 5 హేండ్లింగ్ చేస్తున్నాం. ప్రధానంగా విశాఖ నగరంలో ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్ట్, ఎన్‌టిపిసి, గంగవరం పోర్టు వంటివాటితో సంబంధాలు నెరుపుతున్నాం. ఎన్‌టిపిసి ఫ్లై యాష్‌ను కూడా త్వరలో కంటైనర్ చేయబోతున్నాం. విశాఖలోని గేట్‌వే, శ్రావణ్ సంస్థలు కాంకర్ బిజినెస్‌లో పాల్గొంటున్నాయి.

ఇంకా ఇతర దేశాలతో ఏమైనా కంటైనర్ హేండిల్ చేస్తున్నారా?

కాంకర్‌కు దేశంలో 60 టర్మినల్స్ ఉన్నాయి. ఎగ్జిమ్ వ్యాపారం దేశం లోపలైతే సొంత కంటైనర్, దేశం దాటి ఎగుమతైతే అవుటర్ లైన్స్ (షిప్పింగ్‌లైన్స్) మాసిల్, హెచ్‌ఎస్‌సి, హెపాగ్లోయిడ్, నేవియో వంటి వివిధ షిప్పింగ్ లైన్స్‌లో పంపుతున్నాం. నేపాల్‌తో ట్రాఫిక్ బాగా హేండ్లింగ్ చేస్తున్నాం. రాయపూర్, నాగపూర్, గౌహతి, పాట్నాకు కంటైనర్ బిజినెస్ బాగుంది. వ్యవసాయ, ఆహార ఉత్పత్తులను వేరే దేశాలకు మన దేశంలోని ఈ రాష్ట్రాల నుంచి పంపుతున్నాం. రొయ్యలను ఈక్వెడార్‌కు ఎగుమతి చేస్తున్నాం.

కాంకర్ ప్రత్యేక సర్వీసులేమైనా ఉన్నాయా?

గుజరాత్‌లోని ముంద్రా, కత్యాస్ పోర్టులకు డబల్ డెక్కర్‌లో కంటైనర్ నిర్వహిస్తున్నాం. ఒక కంటైనర్‌లో 27 టన్నుల లోడు సహజంగా ఉంటుంది. కాంకర్ ద్వారా బిజినెస్‌కు గల అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునే ప్లాన్‌తో ముందుకు సాగుతున్నాం.

వికెట్ తీసిన ఆనందంలో రాయలసీమ కింగ్స్ జట్టు ఆటగాళ్లు

రాయలసీమ కింగ్స్ గెలుపు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఎపిఎల్ సీజన్ 2 మ్యాచ్‌లు రంజుగా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌ని చూసేందుకు ప్రేక్షకుల ఎక్కువ సంఖ్యలో మైదానానికి వచ్చారు. గోదావరి టైటాన్స్ - రాయలసీమ కింగ్స్ జట్లు తలపడగా రాయలసీమ్ కింగ్స్ విజయం సాధించింది. తొలుత టాస్ గెలుచుకున్న రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మ్యాన్లు 20 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 150 పరుగులు సాధించారు. ఎనిమిదో స్థానంలో దిగిన బౌలర్ టి.విజయ్ కుమార్ అద్భుతమైన ఆట తీరు కనబరిచాడు. కేవలం 25 బంతుల్లో 5 సిక్సులు, 6 ఫోర్లతో 63 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ జట్టు 17.4 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 153 పరుగులు చేసి విజయం అందుకుంది. అభిషేక్ రెడ్డి 37 బంతుల్లో 2 సిక్సులు, 7 ఫోర్లతో 53 పరుగులు చేసి రాణించాడు.

22న న్యాయ సేవలపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజా రవాణా, విమానయానం, విద్యా, వైద్య సేవలు, పోస్టల్ సేవలు, మున్సిపల్ కార్పొరేషన్, ఎలక్ట్రిసిటీ బోర్డ్, టెలీ కమ్యూనికేషన్స్, ఉపాధి హామీ చట్టం అంశాల్లో న్యాయ సలహాలు అందించేందుకు వార్వా, నివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 5 గంటలకు ఎంవిపి సెక్టార్ 6లోని భద్రం పార్క్‌లో సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి కెఎం.కుమార్ మంగళం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత జిల్లా జడ్జి జి.వల్లభ నాయుడు హాజరవుతారని తెలిపారు.

గత స్మృతులకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీవితంలో మరుపురాని సన్నివేశాలను, గత స్మృతులను గుర్తుకు తెచ్చేవి ఛాయాచిత్రాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ స్థానిక బీచ్ రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ఆయన ఆదివారం తిలకించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు అత్యంత కఠినమైన పరిస్థితుల్లో కూడా విధులు నిర్వర్తిస్తూ సాహసోపేతమైన పరిస్థితుల మధ్య కీలకమైన ఫొటోలను కెమెరాలో బంధించి బాహ్య ప్రపంచానికి తెలియజేస్తూ ఉంటారని అన్నారు. ప్రకృతి అందాలను ప్రజలందరికీ కళ్లకు కట్టినట్టు చూపించే ఫోటోగ్రాఫర్లు అభినందనీయులని అమర్‌నాథ్ అన్నారు. కాలంతో పాటు పోటీపడుతూ ఎప్పటికప్పుడు వినూత్న ఛాయాచిత్రాలను ప్రజల ముందుకు తీసుకు వచ్చేందుకు ఫొటోగ్రాఫర్లు పడుతున్న శ్రమ మరువలేనిదని అన్నారు. విశాఖకు చెందిన ఫొటో జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో అవార్డు సాధించిన వారిని మంత్రి సత్కరించారు. 26 మంది ఫొటో గ్రాఫర్లు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు పివిఎన్.మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావుతో పాటు ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కెఆర్.దీపక్, కె.రామకృష్ణ, ఎస్కే.రఫీ, రాజా, విజయ్ కుమార్, మురళి, శ్రీను, విశ్వేశ్వర్ రెడ్డి, రాజేష్, వేణు, నగేష్ పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి అమర్‌నాథ్

'ఉపాధి' జాబ్‌కార్డుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉపాధి హామీ చట్టం అమలులో 2022-23లో పెద్ద ఎత్తున జాబ్ కార్డులు, పేర్ల తొలగింపును మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) విశాఖ జిల్లా అధ్యక్షులు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ చర్య గ్రామీణ ప్రాంతంలో, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతంలో ప్రజల బతుకుదెరువుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ తొలగింపులు ఎంత వరకూ సమంజసమో తెలుసుకునేందుకు ముగ్గురు సభ్యుల హెచ్‌ఆర్‌ఎఫ్, లిబ్టెక్ సంస్థల బృందం పార్వతీపురం మన్యం జిల్లా చింతలపాడు, బాలేసు (గుమ్మలక్ష్మీపురం మండలం), దుర్బిలి (కురుపాం మండలం)లో మూడు ఆదివాసీ గ్రామాలను ఈ నెల 19న సందర్శించిందని, ఆ పరిశీలనలో మూడు గ్రామాల్లో 30 మంది తొలగింపబడ్డ వేతన కూలీలను ప్రతినిధులు కలిశారని చెప్పారు. వారిలో ఐదుగురి తొలగింపులు మాత్రమే కారణాలతో కూడి ఉన్నాయన్నారు.

ఈ పథకానికి ఏటా తగ్గిపోతున్న బడ్జెట్‌తో పాటు ఇప్పుడు ఈ తొలగింపులను చూస్తే మొత్తం ఉపాధి చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నంలా అనిపిస్తోందన్నారు.

మళ్లీ వచ్చేది వైసిపి ప్రభుత్వమే..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో వైసిపియేతర పార్టీలన్నీ ఒక్కటై వచ్చినా అవన్నీ జగన్మోహన్ రెడ్డి ముందు చిత్తుకాక తప్పదని, మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఉదయం బీచ్‌లోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను వైసిపి కైవసం చేసుకున్నప్పటికీ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే ఘన విజయాన్ని సాధించినట్టు కొన్ని పత్రికలు బాకా ఊదడాన్ని చూస్తే విడ్డూరంగా కనిపించిందని అన్నారు. అప్పుడప్పుడూ గెలిచే పార్టీలు ఇలాగే వార్తలు రాయించుకుంటాయని, సంబరాలు చేసుకుంటూ ఉంటాయని, వారి ఆనందాన్ని మేము ఎందుకు కాదంటామని అన్నారు.

ఆనందపురం ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'నాకు జీతం లేనప్పుడు మీకెందుకు జీతాలు ఇవ్వాలి' అని తన డిడిఒ లాగిన్ నుంచి తనే స్వయంగా బయటికి వెళ్లి పోయి జూన్ నెల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అనందపురం ఎంఇఒ ఎన్.ఎస్.పద్మావతిపై జిల్లా కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంఇఒ పద్మావతి నిర్లక్ష్య వైఖరిపై గత నెల 10న విశాఖ జిల్లా కలెక్టర్‌కు తాము ఫిర్యాదు చేయగా చర్యలు కోసం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. విచారణ పారదర్శకంగా జరగాలన్నారు. అయితే ఈ రోజుకూ చర్యలు కానరాలేదని తెలిపారు. జూన్ నెల జీతాలు అందకపోవడానికి ఎంఇఒ పద్మావతి నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. బదిలీపై వచ్చిన కొత్త టీచర్లకు కూడా ఈ మండలంలో నేటికీ జీతాలు లేవన్నారు. వీటన్నింటికీ ఎంఇఒ స్వయంకృత అపరాధాలే కారణమన్నారు.

'డయల్ యువర్ ఆర్‌డిఒ' రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి సోమవారం రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చేపట్టే డయల్ యువర్ ఆర్‌డిఒ కార్యక్రమం ఈ సోమవారం రద్దయింది. ఈ విషయాన్ని ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

DOCUMENTS LOST

I MANDADI ANIL KUMAR S/o M. APPA RAO RESIDENT OF FLAT No.503, SRI VARSHINI ANANDA NILAYAM, 4th FLOOR, SATAVAHANA NAGAR 5th ROAD, KURMANNA PALEM, VISAKHA PATNAM-46. I HAVE LOST MY PROPERTY DOCUMENTS BEARING FLAT NO.4 F-503, DOOR No: 31-7-2/73, WITH IT'S ASSESSMENT NO: 1088209338, SITUATED IN SRI VARSHINI ANANDA NILAYAM, 4th FLOOR, SATAVAHANA NAGAR 5th ROAD, KURMANNAPALEM, VISAKHA PATNAM-46. WITH REGISTERED SALE DEED WITH BEARING DOCUMENT NO.2104/2014. WHILE I WAS TRAVELLING FROM MY HOUSE TO KURMANNA PALEM JN., ON 10-08-2023. IF ANYONE FOUND THE SAME I REQUEST YOU TO PLEASE RETURN THE DOCUMENTS TO ME.

CELL NO : 9445694281

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 16/2022

వాది: గోల్డెన్ పాకజెస్, రి॥బై॥ ప్రొ॥ రెడ్డి సర్వేశ్వరరావు

మరియు

ప్రతివాది: కె.ఎస్.ఫుడ్స్, రి॥బై॥ప్రొ॥ కోల శేఖర్, R/o. జంగలపాలెం గ్రామం, పెందుర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.

ప్రకటన

ఈ నెంబరు దావాలో వాది ప్రతివాదిపై బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. ప్రతివాదికి కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినా Avaid చేయుచున్నారు. పై నెంబరు దావాలో ప్రతివాది వాదన తెలియపరుచుటకు శ్రీ కోర్టు వారు **ది.31-08-2023వ సం॥రం తేదీన** వాయిదా వేసియున్నారు. **ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను.** లేనిఎడల శ్రీ కోర్టు వారు పరోక్షముగా తీర్మానించబడును కావున తెలియజేయడమైనది.

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్

తణుకు, అడ్వకేట్, తణుకు.

14-8-23. సెల్: 77992 35999

IN THE COURT OF THE HON'BLE Xth JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD

O.S.NO. 3116 OF 2019

BETWEEN:
Telangana State Tourism Development Corporation Ltd.
....PLAINTIFF

AND

Sri.Rajesh
...DEFENDANT

To,
Sri.Rajesh S/o not Known, Aged:Major R/o Opposite to Dr.Reddy Hospital,Near Rama Theatre(Map), Siripuram, Vishakhapatnam-530003,A.P.
...DEFENDANT

PLEASE TAKE NOTICE THAT, THE ABOVE NAMED PLAINTIFF HAS FILED ABOVE SUIT AGAINST YOU FOR RECOVERY OF Rs.1,42,136.12ps (In words Rupees One Lakh Forty two Thousand One Hundred and thirty six)only,You are hereby summoned to appear in the above Hon'ble Court on 18-09-2023, at 10:30 a.m. either in person or through an advocate duly instructed, failing which the case will be heard in your absence and decided on merits.

//By order of the Court//

D.SRINIVAS RAO
Advocate,
H.No. 3-4-381,
Basanth Nagar Colony,
Kacheguda,Hyderabad.

భూవివాదంపై కేసు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని బాందేవపురం గ్రామానికి చెందిన ఇందుకూరు శ్రీనివాసరాజు వెంకట సత్యనారాయణ రాజు, దండు కృష్ణంరాజు, అడ్డాల రవివర్మ, రాజావర్మ తనపై దాడి చేశారంటూ అదే గ్రామానికి చెందిన దండు నరసింహరాజు ఈ నెల 16వ తేదీన పోలీసులకు ఫిర్యాదుచేశారు. తనకు తాతతండ్రుల నుంచి సంక్రమించిన భూమిలో వాటా ఉందంటూ వారు కర్రలు, కత్తులతో ఇంటికి వచ్చి దాడిచేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దండు నరసింహరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సిఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తునకు ఎఎస్ఐ శ్రీనివాసరావు అప్పగించారు.

బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై కార్యశాల

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రి ఆధ్వర్యాన బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై అవగాహన, కార్యశాలను నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. అపోలో కేన్సర్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయే నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యశాలకు వివిధ జిల్లాల నుంచి జనరల్ ఫిజిషియన్స్, పిడియాట్రిషియన్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స విధానం, అది ఎక్కువగా ఎవరికి వస్తుంది, దాని నివారణ చర్యలపై చర్చించారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అనేది దెబ్బతిన్న ఎముక మజ్జను భర్తీ చేయడానికి ఆరోగ్యమైన ఎముక మజ్జ మూల కణాల మార్పిడిని చేసే ఒక ప్రత్యే వైద్య విధానంపై అవగాహన కల్పించారు.

వైసిపి, బిజెపిని ఓడించి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలో వైసిపి, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలను ఓడించి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జివిఎంసి 7వ వార్డు పరిధి మధురవాడ జోన్ కళానగర్ తదితర ప్రాంతాల్లో సిపిఐ కార్యకర్తలు ఆదివారం ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, 'వైసిపి రాక్షస, రౌడీ పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించండి.. బిజెపి మతోన్మాద పాలన నుంచి దేశాన్ని కాపాడండి' అన్న నినాదంతో సిపిఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను మత ప్రాతిపదికన విభజించి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి పరిపాలన సాగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. పోరాటాలు, త్యాగాలతో ప్రభుత్వ రంగంలో సాధించుకున్న విశాఖ ఉక్కును నిస్సిగ్గుగా అమ్మేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలకు ఏమాత్రం వ్యతిరేకత చెప్పకుండా అమలు చేసి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, అదనపు వడ్డీలు, సర్ చార్జీలు పేరిట వసూలు చేస్తూ భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎమ్‌డి.బేగం, జి.వేలంగిణిరావు, ఎంఎస్.పాత్రుడు, ఎన్.త్రినాథ్, కె.చిన్న, డి.సతీష్, నారాయణరావు, టిడిపి నాయకులు ఎన్.రాము, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై టిడిపి ప్రచారం

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు. 10వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టిడిపి నాయకుడు రాజశేఖర్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో టిడిపి అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి కేతర సత్యనారాయణ, రాజేష్, సుధాకర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మత్స్యకారుడు గల్లంతు

ప్రజాశక్తి-ములగాడ : నేవల్ డాక్‌యార్డు బ్రిడ్జి వద్ద చేపల వేట చేస్తూ ఓ మత్స్యకారుడు సముద్రంలో గల్లంతయ్యాడు. మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... విశాఖ జాలారిపేటకు చెందిన ఎం.ఎర్రయ్య (40) ఆదివారం మధ్యాహ్నం డాక్‌యార్డు బ్రిడ్జి వద్ద ఉన్న జట్టీ వద్దకు వచ్చి చేపల వేట చేస్తున్నాడు. చేపలు వేటచేస్తుండగా కాలు జారి పడి నీటిలో మునిగిపోయాడు. ఆ రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులందరూ చూస్తుండగానే మత్స్యకారుడు జారి పడిపోయి ఆచూకీ కనబడలేదు. ప్రయాణికులు మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. మల్కాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నేవల్ సిబ్బందికి సమాచారమిచ్చారు. నేవల్ సిబ్బంది గాలింపు చేపట్టారు.

గొలుసు చోరీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురంలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం పెద్దపల్లి వీధికి చెందిన శతగోపం బాలరాజు, శ్రీనివాసులమ్మ బంధువులతో కలిసి గాజువాకలో ఒక శుభకార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఆనందపురం మండలం, ముకుందపురం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలో బంగారపు వస్తువులు తెంపుకొని స్పీడుగా వాహనాన్ని పోనిచ్చారు. ఈ ఘటనలో శ్రీనివాసులమ్మ ద్విచక్రవాహనంపై నుంచి కిందపడిపోయారు. దీనిపై బాధితులు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ ఎస్ఐ మన్మధరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముకుందపురం కూడలిలో ఉన్న కిరణా షాపు సీసీ కెమెరా పుటేజ్ ను పరిశీలించారు. నిందితులు పద్మనాభం వైపు వెళ్లినట్లు గుర్తించారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గొలుగొండ: ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామానికి చెందిన గుడివాడ వరహాలబాబు నర్సీపట్నం మండలం పట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరిగి వస్తున్నాడు. గొలుగొండ మండలం వెంకటాపురం గ్రామ సమీపంలో వరహాలబాబు ద్విచక్ర వహనాన్ని మరో బైక్ ఢీకొంది. దీంతో వరహాలబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎం.నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని సీతపాలెం బీచ్‌లో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. బీచ్ సందర్శనకు వచ్చిన విద్యార్థి సముద్రంలో మునిగిపోయి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... విశాఖకు చెందిన కొట్టోజు సాయి, గన్నవరపు సాయి ప్రియాంక, గన్నవరపు రవి శంకర్, కొట్టోజు కావ్య, కండిపల్లి ఫణింద్ర, కండిపల్లి సాయి కిరణ్ తదితర ఆరుగురు విద్యార్థులు ఆదివారం ఉదయం సీతపాలెం బీచ్‌కు సందర్శనార్థం వచ్చారు. సముద్ర ఒడ్డున సగం మునిగిన రాతి బండలపైకి వెళ్లి ఫొటోలు తీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కొట్టోజు సాయి (19) పడిపోయి సముద్ర కెరటం తాకిడికి కొట్టుకుపోయాడు. సాయికి సమీపంలో ఉన్న గన్నవరపు సాయి ప్రియాంక ఈ ఘటనలో చిక్కుకొని బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగి సముద్రంలో గల్లంతైన సాయి కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల సమయంలో సాయి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై రాంబిల్లి ఎస్ఐ దీనబంధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జోగారావుపేట గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కొత్తపల్లి సిరి (11) అనే బాలిక ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లి నూకరాజు కుమార్తెలు సిరి (11) మాధురి (9) ఇద్దరూ కలిసి తమ వ్యవసాయ పొలానికి వెళ్లారు. ఆవుకు నీరు పెట్టేందుకు సిరి తమ విద్యుత్ మోటార్ ప్లగ్ వేయగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలింది. ఇది గమనించిన చెల్లి మాధురి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వెంటనే సిరిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కశింకోట అదనపు ఎస్ఐ పిడి సుందరమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఐదవ తరగతి చదువుతోంది. సిరి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

శిల్పారామంలో జానపద, శాస్త్రీయ నృత్యాలు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో లలిత డ్యాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాలు నిర్వహించారు. మూషిక వాహన, గరుడ గమన, ముద్దుగారే యశోద, గణ నాయక, ఐగిరి నందిని, పలుకే బంగారమాయెనా, కృష్ణా మా ఇంటికి, శివ తాండవం తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎం.లలిత, జి.సోని నృత్య దర్శకత్వం వహించగా అనన్య, పవిత్ర, లీలా, సౌమ్య, భావన, సిరి చందన, దివ్య, హేమ సుధ, దివ్యశ్రీ, నిహారిక, నిత్య, లక్ష్మి, రేఖ, వర్షిణి, నిత్య, సంయుక్త, ఐశ్వర్య, నిఖిత, హరిణి, హేమశ్రీ కళాకారులు నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు.

శిల్పారామంలో నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

గాజువాకలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం నగరంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : గాజువాక రాజీవ్ కూడలి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి గాజువాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, నాయకులు అస్మిత్ ఆలీ, యరబాల భూలోక, ఉరుకూటి బాబూరావు, స్వర్ణ, మురళి, అలీ, రమణారావు, శ్రీను, సింహాచలం, అప్పలనాయుడు, కోదండరావు పాల్గొన్నారు.

పెందుర్తి : చినముషిడివాడలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి విస్సకోట రాము పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల సన్యాసిరావు, కె.రామకృష్ణారావు, ఎం.సంతోష్, రెడ్డి నరేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

నక్కపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడేటి శంకర్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సి హెచ్‌సిలో రోగులకు గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి ఈశ్వరరావు, బత్తుల రఘు, నీలి అశోక్, ముద్దా త్రినాధరావు, మొల్లేటి చిన్ని, దేశెట్టి నాగేశ్వరావు, గంగిశెట్టి గణేష్, ముప్పిని వీరస్వామి, సాయి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్‌కె బీచ్ వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్, నగర అధ్యక్షులు గొంప గోవిందరాజులు, అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్.రామారావు, సేవాదళ్ అధ్యక్షులు బొమ్మిడి గంగాధర్, ఎస్‌సి సెల్ నాయకులు కస్తూరి వెంకటరావు పాల్గొన్నారు.

అనకాపల్లిలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి ఆదివారం అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐఆర్ గంగాధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరేశ్వరపు రాంప్రసాద్, అవినాష్ ఇళ్ళ, టి.సంతోష్ పాల్గొన్నారు.

కశింకోట : రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు సందర్భంగా మండల కేంద్రంలోని మెయిన్ రోడ్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరా శ్రీనివాస్, బోయిన భాను మూర్తి యాదవ్, కాళ్ళ వెంకట సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు, సూరిశెట్టి ఆదిబాబు, అబ్దుల్ హక్, బి.బాల మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

అధికారంలోకి వస్తే నాలుగెకరాల్లో క్రీడామైదానం

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి అధికారంలోకి వస్తే నాలుగు ఎకరాలలో క్రీడామైదాన్ని ఏర్పాటుచేస్తామని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. జివిఎంసి 96వ పరిధి ప్రయివేటు కళ్యాణ మండపంలో జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారని, ఇది మంచిది కాదని, విద్యార్థి దశ నుంచే క్రీడలు అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో డ్రిల్ పిరియడ్‌లో కరాటే క్రీడకు అవకాశం ఇవ్వాలన్నారు. విద్యా వ్యవస్థను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నాడు- నేడు కింద పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారే తప్ప తగిన నిర్వహణ ఎక్కడా లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, చీఫ్ ఆర్గనైజర్ ప్రేమ్‌కుమార్, ఆర్గనైజర్ హరినాథ్ రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'రుషికొండపై బొత్సకు అవగాహనలేమి'

ప్రజాశక్తి-సీతమ్మధార : రుషికొండపై మంత్రి బొత్స సత్యనారాయణ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రుషికొండపై 139 చెట్లను తొలగించడానికి అనుమతులు తీసుకొని, ఎన్నో వేల చెట్లు కొట్టేశారన్నారు. రుషికొండపై నిర్మాణాల్లో పర్యావరణ, సిఆర్‌జెడ్ నిబంధనలు పాటించలేదన్నారు. నిజంగా రుషికొండపై ప్రభుత్వ భవనాలు కడితే సందర్శించడానికి విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను ఎందుకు అడ్డుకున్నారో బొత్స సమాధానం చెప్పాలన్నారు. విసన్నపేటలో కొండను తవ్వి, ఎలుకను పట్టలేదని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు సరికావని, విసన్నపేటలో 89 ఎకరాలు తిన్న పంది కొక్కుని తాము పట్టుకున్నామని స్పష్టం చేశారు. బొబ్బిలి పారిశ్రామిక వాడలో 30 ఎకరాలు బొత్స సోదరునికి కారుచౌకగా కట్టబెట్టారని, మార్కెట్ విలువ ఎకరం రూ.1.20 కోట్లు, ఎపిక్ ధర రూ.85 లక్షలు ఉంటే, కేవలం ఎకరా రూ.10 లక్షలకు దోచేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో బొత్స వ్యాఖ్యలపై చర్చకు తాము రెడీగా ఉన్నామని, దమ్ము ఉంటే బొత్స మాతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

మాతృత్వ వందన యోజన పథకాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని, వెబ్‌సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని పేద మహిళల కోసం ఏర్పాటు చేశారన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడానికి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను బ్యాంకు ఖాతాలోకి కేంద్ర ప్రభుత్వం వేస్తుందన్నారు. 2017లోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ పథకం కింద ప్రతి నెలా వేలాది మంది మహిళలు దరఖాస్తులు పెట్టుకొని లబ్ధి పొందుతున్నారన్నారు. అయితే, విశాఖ జిల్లాలో కొన్ని నెలలుగా ఈ పథకాన్ని ఆపివేశారన్నారు. వెబ్ సైట్ ఓపెన్ అవ్వటం లేదన్నారు. ఏ కారణంతో ఆపివేయబడిందో తెలియటం లేదన్నారు. పేద మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ పథకం ఎంతో ఉపశమనంగా నాడు ఉండేదన్నారు. ఈ పథకాన్ని కూడా పేదలకు దూరం చేయడం వల్ల శిశు మరణాలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర నిధులతో ఏర్పాటుచేసిన ఈ పథకాన్ని, వెబ్‌సైట్‌ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

'మాకూ టిక్కెట్లు కేటాయించండి'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ బ్రాహ్మణ సామాజిక తరగతికి ఐదు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు కేటాయించాలని ఆదివారం విశాఖపట్నంలో శ్రీ వేద విజ్ఞాన్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన బ్రాహ్మణ మేధావుల సదస్సు తీర్మానించింది. ముఖ్యంగా రెండు లక్షల మంది బ్రాహ్మణులు కలిగిన విశాఖలో రెండు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. పరిషత్ అధ్యక్షులు డివిఎస్.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో చెరువు రామకోటయ్య, రామభద్రుడు, తురగా శ్రీరామ్, ముళ్ళపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-పెందుర్తి: పంచ గ్రామాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం వేపగుంటలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, సుమారు రెండు దశాబ్దాలపైబడి పంచ గ్రామాల సమస్య కొనసాగుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు వచ్చి వాగ్దానం చేయడం, తరువాత మర్చిపోవడం అనవాయితీగా వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇళ్లకు చిన్న చిన్న మరమ్మతులు చేసుకునేందుకు కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మన భూమిపై దేవస్థానం పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో దేవస్థానం పీఠాధిపతులు కూడా పెత్తనం చెలాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింహాచలం దేవస్థానానికి 1966, 97లో ఇచ్చిన రైత్వారీ పట్టాలను రద్దుచేయాలని, 193 సర్వే సెటిల్మెంట్ ఆధారంగా భూ హక్కు దారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పంచ గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, విబిఎన్.ప్రతాప్, బి.అరుణ్‌కుమార్, కెఆర్.ప్రసాద్, సిహెచ్.కోటేశ్వరరావు, ఎస్.రాజు, ఎస్‌వి.రమణ, వి.నారాయణరావు, కృష్ణారావు, శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

'ఉక్కు'లో ముగిసిన ఫొటో ప్రదర్శన

ఫొటో ప్రదర్శన ముగింపులో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉక్కు హౌస్‌లో వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ, ఆర్ఐఎన్ఎల్ సంయుక్తంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని శనివారం ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఆదివారం ముఖ్య అతిథిగా డికె మహంతి హాజరై ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, విషాధ సన్నివేశాలు, వెలకట్టలేని దృశ్యాలను పది కాలాలపాటు పదిలంగా కళ్ళ ముందు ఉంచేది ఫొటో అని అన్నారు. స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం నుంచి నేటి వరకు స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన విఐపిలు, హుదూద్ తుపానులో ప్రాజెక్టు పూర్తయిన దృశ్యాలు ఈ ప్రదర్శనలో ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ఫొటోగ్రాఫర్లు యు.రామరాజు, పి.శ్రీనివాసును ఘనంగా సన్మానించారు.

వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ కార్యదర్శి ఎంవి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, వరల్డ్ ఫొటోగ్రఫీ డే ఫొటో ప్రదర్శనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన స్టీల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కార్పొరేటర్ కమ్యూనికేషన్ హెచ్ఒడి ఆర్‌పి.శర్మ, వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్షులు పిఎన్ సేత్, గాజువాక ప్రాంత ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. అనంతరం వరల్డ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లను డీకే మహంతి సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సమాజ చైతన్య దీపికలు కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రముఖ రచయిత తురగా వెంకట నాగేశ్వరరావు రచించిన 'సమాజ చైతన్య దీపికలు' కవితా సంపుటిని కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సూర్యారావు మాట్లాడుతూ, సామాజిక అంశాలతో సమాజ చైతన్య దీపికలు పేరుతో రచయిత కవితా సంపుటి రాయడం అభినందనీయమన్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలను తన కవిత సంపుటిలో రచయిత నాగేశ్వరరావు చక్కగా వివరించారన్నారు. సమాజంలోని సంఘటనలు, ఇతర విషయాలను కథా వస్తువులుగా రాసిన రచనలు కలకాలం ప్రజల్లో ఉంటాయన్నారు. ఈ మేరకు రచయిత రాసిన కవితా సంపుటిలోని కొన్ని కవితలను సూర్యారావు విశ్లేషణ చేశారు. ఈ సందర్భంగా కవితా సంపుటి రచయిత వెంకట నాగేశ్వరరావును అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల తాతాజీ, ప్రముఖ రచయిత నండూరి రామకృష్ణారావు, వైద్యులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వైవి.నరసింగరావు, ఎస్.బాలగోవిందం, కవిత అభిమానులు, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, టాటా గ్రూప్‌తో కలిసి ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రూపులుగా ఏర్పడి ఆర్‌కెబీచ్‌లో ఉన్న చెత్తను సేకరించి జివిఎంసికి అందజేశారు. బీచ్‌లో వ్యర్థాలు మరియు ప్రకృతి వైపరీత్యాలు వల్ల బీచ్‌ను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలో అక్కడ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించారు. గీతం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజం, ప్రకృతిని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

బీచ్‌లో గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

సెల్‌టవర్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం పంచాయతీలో సెల్ టవర్ ఏర్పాటుకు స్థానిక సర్పంచ్ ఎర్ర పైడిరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. సెల్ టవర్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సర్పంచ్ పైడిరాజు తీసుకెళ్లారు. ఆయన చొరవతో సెల్ టవర్ ఏర్పాటుచేస్తున్నారని సర్పంచ్ ఎర్ర పైడిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గుర్ల కనకరాజు, అక్కిరెడ్డి రమణ, అంగరపు గంగరాజు, రమణ, పరమేశ్వరరావు, తాత, దేవుడుబాబు, యర్ర రాము, గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పైడిరాజు

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత ప్రవేశానికి పరీక్ష

స్క్రీనింగ్ టెస్ట్ రాస్తున్నవిద్యార్థులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత ప్రవేశం కోసం ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఎపి ప్రభుత్వంచే ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సివిల్ సర్వీసులు, గ్రూప్ 1, గ్రూప్-2 పరీక్షలకుగాను శిక్షణ ఇచ్చేందుకు ఈ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించామని సాంఘిక సంక్షేమ శాఖ విశాఖపట్నం ఉప సంచాలకులు జె.రామారావు మీడియాకు తెలిపారు. విశాఖపట్నంలో ఏడు సెంటర్లలో 3726 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2217 (60 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్ష జిల్లాలో ఎటువంటి అవాంతరాలూ లేకుండా విజయవంతంగా జరిగిందన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విన్నవించారు. ఈ మేరకు యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, ఉపాధ్యక్షులు కె.కాసులమ్మ, కె.ఉమానారాయణమ్మ ఆదివారం గాజువాక మిందిలోని మంత్రి స్వగృహంలో మంత్రి అమర్నాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ కల్పించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఫేషియల్ యాప్, ఆన్లైన్ పేరుతో పెంచిన పనిభారం తగ్గించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీలుగా మార్పు చేయాలని, అంగన్వాడీలకు నాణ్యమైన సరుకులు అందించాలని, టిఎ, డిఎలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి అమర్నాథ్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

23న యలమంచిలి మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని స్థానిక ఎంపిడిఒ కె.అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి బోదెపు గోవిదరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పూడ్చని ఆర్‌ఎస్ ఛానల్ ఆనకట్ట గండి

- వృథాగా పోతున్న కోనాం రిజర్వాయర్ నీరు

- సాగునీరు లేక పడని వరి నాట్లు

నీరు లేక వరి నాట్లు పడని మంగళాపురం భూములు

ప్రజాశక్తి-చోడవరం

పుష్కలంగా నీరు ఉండి, రెండు పంటలు పండవలసిన భూములు పాలకుల నిర్లక్ష్యం వలన బీడు భూములుగా మారిపోయాయి. బుచ్చయ్యపేట, చీడికాడ మండలాల అనుసంధానంగా ఉన్న మంగళాపురం ఆర్ఎస్ ఛానల్‌కు గండిపడి మూడేళ్లయినా నేటికీ దానిని పూడ్చలేదు. కోనాం రిజర్వాయర్ నుండి విడుదలయ్యే నీరు బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట, మంగళాపురం, కుముందానుపేట, చీడికాడ మండలం దండిసొరవరం, దిబ్బపాలెం, కట్టవాని అగ్రహారం గ్రామాల్లో పంట భూములుకు ఆర్ఎస్ ఛానల్ ఆనకట్ట ద్వారా సాగునీరు అందుతుండేది. ఈ ఛానల్ ద్వారా అధికారికంగా ఆరు చెరువులకు, ఎనిమిది వందల ఎకరాల ఆయకట్టు భూములకు నీరు అందేది. 2020లో కురిసిన వర్షాలకు ఛానల్ ఆనకట్టకు గండి పడటంతో ఒక ఏడాది ఆయా గ్రామాల రైతులు చందాలు వేసుకుని ఆనకట్టు పై భాగంలో గట్టు వేసి నీటిని మళ్లించుకున్నారు. తదుపరి కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో మరలా యధాస్థితికి వచ్చింది. నాటి నుండి ఈ గండిని పూడ్చలేదు. దీంతో తమ పంట పొలాలకు నీరు రాకుండా పోవడంతో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ శాఖకు నిధులు ఇవ్వకపోవడంతో మరమ్మతులు చేపట్టే ప్రక్రియ వీలు కాదని అధికారులు చేతులెత్తేశారు. ఆర్ఎస్.ఛానల్ ఆనకట్ట గండి పూడ్చి తమకు సాగునీరు అందివ్వాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని కలిసి రైతులు వినతి పత్రాలు అందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మొరపెట్టుకున్నారు. అయినా పరిష్కారం కాలేదు. ఈ కాలువకు కోనాం రిజర్వాయర్ ద్వారా నీరు వస్తుంది. రిజర్వాయర్లో పుష్కలంగా ఉన్న నీరు విడుదల చేస్తున్నప్పటికీ అది బొడ్డేరు ద్వారా వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌కు అదును గడిచిపోయినా రెండవ పంట వేసుకునే సమయానికైనా ఆర్ఎస్ ఛానల్ గండి పూడ్చి దాని ద్వారా నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

లక్ష గాజుల అలంకరణలో నూకాంబిక దర్శనం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం మొదటి ఆదివారం చవితి హస్త నక్షత్రం సందర్భంగా భక్తులు సమర్పించిన లక్ష గాజులతో అమ్మవారి మూలవిరాట్‌కు గాజుల అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బండారి ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీ నూకాంబిక అమ్మవారి లక్ష గాజుల అలంకరణతో సోమవారం, మంగళవారం కూడా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

డిసిఇబి మెంబర్‌గా డాక్టర్ ఖాసీం

డాక్టర్ ఖాసీం

ప్రజాశక్తి- కె.కోటపాడు

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు మెంబర్‌గా స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, 'అపుస్మా' ఐటీ విభాగం రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాసీం, ఎలమంచిలి శ్రీగౌరీ విద్యానికేతన్ కరస్పాండెంట్ 'అపుస్మా' అనకాపల్లి జిల్లా కోశాధికారి భీశెట్టి వరప్రసాదరావు నియమితులయ్యారు. వీరితోపాటు ఈ బోర్డులో మరో 16 మంది విద్యారంగానికి చెందిన ప్రముఖులను ఎంపిక చేశారు. ఈ మేరకు వారందరికీ జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు అందించారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ చైర్మన్‌గా వ్యవహరించిన ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి వ్యవహరిస్తారు. మరో ఆరుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్లకు చెందిన అధికారులను నియమించారు. డాక్టర్ ఖాసీం, బి.వరప్రసాదరావులు డిసిఇబి సభ్యులుగా నియమితులు కావడం పట్ల 'అపుస్మా' రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, నల్లపురెడ్డి సీతారామరాజు హర్షం వ్యక్తం చేశారు. డిఇఓ వెంకట లక్ష్మమ్మకు నూతన సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
తాళ్ళపాలెం,
కశింకోట మండలం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
మరియు
సిబ్బంది, కశింకోట

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
కోనాడ లావణ్య
ఆయుర్వేద వైద్య అధికారిణి
కన్నూరుపాలెం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ వెంకటసాయి తేజ ఫెర్టిలైజర్స్
ప్రొ॥ ఆడారి దేవకీరావు,
మునగపాక

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
పి.చంద్రశేఖర్,
మండల ఇంజనీరింగ్ అధికారి,
మునగపాక

ప్రజాశక్తి విభజన చట్టానికి తూట్లు
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
ఇంటి గ్రేటెడ్ బాలికల వసతి గృహం
బి.సి.బాలుర వసతి గృహం, కశింకోట.

ప్రజాశక్తి విభజన చట్టానికి తూట్లు
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
మండల వ్యవసాయ శాఖ కార్యాలయం
మరియు సిబ్బంది, కశింకోట

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హార్థిక శుభాకాంక్షలు
ఎ.ఇ. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్
మునగపాక

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ప్రపంచ దోమల దినోత్సవంలో భాగంగా మునగపాకలోని పలు వీధుల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.విమలగిరి ఆధ్వర్యంలో ఆదివారం దోమల నియంత్రణపై అవగాహన రాలీ నిర్వహించారు. దోమ పుట్ట కూడదు.. దోమ కుట్ట కూడదు అనే నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఎ.ఉమామహేష్, విఎస్ఎమ్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు సంతోషి, భవాని, ఏఎన్ఎంఎంలు జయశ్రీ, దేవకి, రేవతి, ఆరోగ్య కార్యకర్త వి జగన్నాథరావు, ఆశా కార్యకర్తలు ఎం లక్ష్మి, జయపద్మ, రూప, డి లక్ష్మి, గౌరీ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : మున్సిపల్ శాఖలో 60 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 22న విజయవాడ సిఎండిఎ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలన్నారు. కార్మికులు సమ్మె చేపట్టి ఏడాది దాటినా ఏఒక్క సమస్యపై కూడా సీఎం జగన్ స్పందించలేదని దుయ్యబట్టారు. అర్జీలు తీసుకొని 50 రోజులు దాటినా కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

23లోగా పాలిటెక్నిక్ అభ్యర్థులు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్-2023 సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల చేసిన నేపథ్యంలో సీటు వచ్చిన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ లోగా అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్-ఎస్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయినింగ్ రిపోర్ట్‌తో పాటు సీటు కేటాయింపు ధ్రువీకరణ పత్రం, రెండు సెట్ల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు అందజేయాలని కోరారు. లేకుంటే వారి సీటును కోల్పోవాల్సి వస్తుందన్నారు. కాగా మొదటి సంవత్సరం తరగతులు ఈనెల 23 నుంచి ప్రారంభమవుతున్నట్టు తెలిపారు.

విద్యుత్ వైర్లు చోరీ చేసిన యువకులను పట్టుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కొద్ది రోజులుగా బుచ్చయ్యపేట, ఐతంపూడి తదితర గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు చెందిన విద్యుత్ వైర్లు చోరీ చేసిన పలువురు యువకులను ఆదివారం బుచ్చయ్యపేట గ్రామస్తులు పట్టుకున్నారు. రెండు రోజులుగా బుచ్చయ్యపేట, ఐతంపూడి గ్రామాలకు చెందిన సుమారు 20 వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్ స్తంభానికి మోటారుకు మధ్య గల వైర్లను కత్తిరించుకొనిపోయారు. ఆదివారం ఉదయం బుచ్చయ్యపేట శివారు ప్రాంతంలో గల పొలాల వద్ద పలువురు యువకులు దొంగలించిన వైర్లను కాల్చుతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. అలాగే దిబిడి-బుచ్చయ్యపేట గ్రామాల మధ్య ఉన్న దొండ ఏడుకొండలకు చెందిన రైస్ మిల్‌లో గల పలు వైర్లను సైతం వారం రోజుల క్రితం దొంగలించారు. ఈ మేరకు బుచ్చయ్యపేట, ఐతంపూడి గ్రామాల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దిలీప్‌కుమార్‌కు స్వాగతం పలికేందుకు తరలిరావాలి

ప్రజాశక్తి -కశింకోట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ నియమితులై అనకాపల్లి వస్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌కు సోమవారం స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపిపి కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు మండలంలోని తాళ్లపాలెం నుండి అనకాపల్లి రింగ్ రోడ్డు వరకు ద్విచక్ర వాహనం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాడేరు ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

- లోయలో పడిన ఆర్‌టిసి బస్సు
- ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
- మరమ్మతుకు నోచని రక్షణ గోడలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం వైజాగ్ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు లోయలో పడిపోయింది. 38 మంది ప్రయాణిస్తున్న బస్ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. పాడేరు డిపోకు చెందిన తీస్టాప్ బస్సు విశాఖపట్నం నుంచి పాడేరు వస్తుండగా, సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఘాటిలోని వ్యూపాయింట్ కు సమీపంలోని ఓ మలుపునకు ఎడమవైపు వేలాడుతున్న చెట్టు కొమ్మను ఢీకొనడంతో బస్సు కుడివైపున ఉన్న లోయలోకి పోయింది. ఈ ప్రమాదంలో పాడేరు మండలం బరిసింగి పంచాయతీ జి.కొత్తూరు గ్రామానికి చెందిన సీసా కొందన్న (52), సబ్బవరం మండలం సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నవర నారాయణ (55) మృతి చెందారు. ముంచంగిపుట్టు మండలం సరియాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో బోద్ రాజుకు నడుములో ఎముకలు విరిగిపోగా, అదే మండలం చిప్పాపుట్టు గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీకాంతంకు తలకు తీవ్రగాయం కాగా, నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామానికి చెందిన బుట్ట చిన్నామ్మలు, బస్ డ్రైవర్ కె.సత్తిబాబు తలపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన ఈ నలుగురు బాధితులకు పాడేరు జిల్లా ఆస్పత్రిలో తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవలకు విశాఖ కెజిహెచ్ కు తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు పాడేరు జిల్లా ఆసుపత్రిలోనే వైద్య చికిత్సలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులను విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకొచ్చిన దృశ్యం

బాధితులకు పరామర్శ

జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్

పాడేరు టౌన్

పాడేరు ఘాట్ లో ఆర్ టిసి బస్సు లోయలో పడిన ఘటన ప్రదేశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆర్‌టిసి, పోలీస్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాడేరు చేరుకున్న మంత్రి ప్రమాద స్థలాన్ని పరిశీలించి అనంతరం, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను అమర్నాథ్ కోరారు. అవసరమైతే కేజీహెచ్ కు లేదా కార్పొరేట్ ఆసుపత్రులకైనా క్షతగాత్రులను తరలించి వారు పూర్తిస్థాయిలో కోలుకునే విధంగా వైద్య సహాయం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ విశాఖ నుంచి పాడేరు వస్తున్న ఆర్ టిసి బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిందని, ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని విశాఖ కేజీ హెచ్ కు తరలించామని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు 10 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని ఆయన చెప్పారు. శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి ఐదు లక్షలు, గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిపారు. పాడేరు ఘాట్ రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం చాలా వేగంగా స్పందించి సహాయ చర్యలు చేపట్టడం అభినందనీయమని, కలెక్టర్, ఎస్ పి, ఎమ్మెల్యే, పోలీసు యంత్రాంగం, డాక్టర్లను మంత్రి అభినందించారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా, స్థానిక ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, ట్రైకార్ ఛైర్పర్సన్ శతక బుల్లిబాబు, డిఆర్ఓ పి.అంబేద్కర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగి వైద్యానికి పిఎం సహాయ నిధి మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్న అనకాపల్లి మండలం గొలగాం గ్రామానికి చెందిన సలపురెడ్డి రమణమ్మ హోమియో బాబా కేన్సర్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతిని ఆర్థిక సహాయం కొరకు అర్థించారు. ఈ మేరకు ఎంపీ స్పందించి పీఎం సహాయ నిధుల నుండి మూడు లక్షల రూపాయలు చెక్కు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆ చెక్కును ఆదివారం ఎంపీ తన క్యాంపు కార్యాలయంలో సాలపురెడ్డి రమణమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరితగతిన స్పందించి సహాయాన్ని అందించిన ఎంపీకి సత్యవతమ్మకి రమణమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



నిధులు మంజూరు పత్రాన్ని ఇస్తున్న ఎంపీ సత్యవతి

మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

ప్రార్థన మందిరం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలోని దిబ్బవీధి శ్రీసీతారామ దేవస్థానం ఆధ్వర్యంలో ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రార్థన మందిరాన్ని శనివారం రాత్రి మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిబ్బవీధి ఆధ్యాత్మిక క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంలో జిల్లాలోనే పేరుగాంచిందని తెలిపారు. దేవస్థానం అనుబంధ సంస్థలైన శ్రీగౌరీ నాట్యమండలి, శ్రీగౌరీ బాలగణపతి క్రీడా సంఘం ఆధ్వర్యంలో సుమారు 40 సంవత్సరాలపైగా క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ దిబ్బవీధి ప్రధాన రహదారిలో సిమెంట్ రోడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు జరిగాయని, త్వరలో కార్యరూపం దాలుస్తుందని తెలిపారు. ఆలయ చైర్మన్ దాడి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి 81వ వార్డు ఇన్‌ఛార్జి పీలా రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్ పివీ జగన్మోహన్రావు, ప్రార్థన మందిరం విరాళ దాతలు పెతకంశెట్టి దిలీప్ కుమార్, కాండ్రేగుల నూకప్పారావు, జర్నలిస్ట్ మద్దాల కృష్ణారావు, ఆలయ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, కోశాధికారి మద్దాల నూక జగదీశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం కోసం ముఠా కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి - పరవాడ

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం ఫార్మా సిటీలో ముఠా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.వెంకినాయుడు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ముఠా కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు కర్రి పోతి నాయుడు, ఆడారి రాజు, పి చిన్నారావు, దేముడు, కె.ధారబాబు, సత్తిబాబు, రాము, రమణ, ముత్యాలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ముఠా కార్మికులు

అల్లూరి స్ఫూర్తితో పోరాటం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-గొలుగొండ: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో తెలుగు ప్రజలను, భారతదేశాన్ని కాపాడేందుకే రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదిస్తూ సిపిఐ ప్రచార జాతా బస్సు యాత్రను ప్రారంభించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ ప్రచార జాతరలో భాగంగా ఆదివారం గొలుగొండ మండలంలో గల ఏఎల్‌పురం గ్రామంలో ఉన్న అల్లూరి స్మారక మందిరాన్ని సందర్శించి అల్లూరి, గంటందొర సమాధులకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అల్లూరి స్ఫూర్తితో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని ఆయన అన్నారు. సెప్టెంబర్ 8వ తేదీన తిరుపతిలో భారీ ర్యాలీ, బహిరంగ సభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, అల్లూరి పార్కు అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అత్తిలి విమల, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి. మాకిరెడ్డి రామనాయుడు, ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి లగుడు వెంకటరమణ, నర్సీపట్నం కార్యదర్శి జి.గురుబాబు, గొలుగొండ కార్యదర్శి మేకా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, రావణాపల్లి ఎంపిటిసి ఇరవాడ సత్యవేణి, కొయ్యూరు కార్యదర్శి ఇరవాడ దేవుడు, సీనియర్ నాయకులు రుత్తల బుజ్జి, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, ప్రజానాట్యమండలి కళాకారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

నివాళ్లుఅర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల: ఓటర్ ధ్రువీకరణ సర్వే పట్ల బూత్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దారు జానకమ్మ సూచించారు. మండలంలో పలు గ్రామాలలో ఓటర్ సర్వేను ఆమె ఆదివారం పరిశీలించారు. ఓటర్ల తొలగింపులు, చేర్పులు, సవరణల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 52 పోలింగ్ బూత్ లలో 94 శాతం సర్వే పూర్తయిందని శత శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బూత్ స్థాయి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఇంటింటా జరుగుతున్న ఓటరు సర్వే తీరును ఆదివారం తహసీల్దార్ అంబేద్కర్ పరిశీలించారు. మండలంలోని వేంపాడు, డి ఎల్ పురం తదితర గ్రామాల్లో పర్యటించి ఓటరు సర్వే ను పరిశీలించారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటివి పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆన్లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి తాతాచార్యులు పాల్గొన్నారు.

పాల్గొన్న కార్యకర్తలు

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఘాట్ రోడ్ జంక్షన్ వద్ద జన సేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జన సేన కార్యకర్తల సమావేశం జరిగింది. రాయ పు రెడ్డి కృష్ణ అధ్యర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 2న నాలుగు మండలాలను కలుపుతూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

-ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: మాజీ మంత్రి అయ్యన్న అసత్య ప్రచారాల మానుకోవాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ హితవు పలికారు. ఆదివారం గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి నిధులు తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కృష్ణదేవిపేట నుంచి నర్సీపట్నం వరకు రోడ్డు విస్తరణ పనులకు అయ్యన్నపాత్రుడు హయాంలో కేవలం జిఒ మాత్రమే తెచ్చారని, నిధులు విడుదల కాలేదన్న విషయాన్ని అయ్యన్న గుర్తించుకోవాలన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఆయనే నిధులు తెచ్చానని, అప్పట్లో ఆ మూడున్నర కిలో మీటర్లకు అటవీ అనుమతులు తెచ్చేలోగా ఎన్నికలు వచ్చేశాయంటూ మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ రోడ్డుకు రెండు దఫాలుగా రూ.19కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వంలో నిధులు మంజూరైతే అయ్యన్న ప్రభుత్వంలో నిధులు మంజూరైనట్లు చెప్పుకోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సి హెచ్.భాస్కరనాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నివాళి అర్పిస్తున్న జెవివి నేతలు

మిషన్లు ఇస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మహిళలు ఆర్థికంగా లాభపడేందుకు రోటరీ క్లబ్ సహకార అందిస్తుందని రోటరీ క్లబ్ నర్సీపట్నం ప్రెసిడెంట్ ఎం.మహేష్ కుమార్ తెలిపారు. నర్సీపట్నం ప్రాంతంలో పేద మహిళలను గుర్తించి ఆర్థికంగా తోడ్పడాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. స్థానిక శారదానగర్‌లోని ఆదివారం రోటరీ క్లబ్ కార్యాలయంలో కుట్టుమిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, భవిష్యత్తులో మహిళలు, విద్యార్థులకు, పేదలకు మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. క్లబ్ సెక్రటరీ శ్రీనువాసరావు, ట్రెజరర్ రాయుడు పాల్గొన్నారు.

బాధితురాలికి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని పెనుగల్లు గ్రామంలో శనివారం రాత్రి పూరిల్లు కాలి పోవడంతో బర్ల లక్ష్మి నిరాశ్రయురాలైంది. ఇటీవల కాలంలో తన భర్త, కుమారుడు కూడా మరణించారు. ఇలాంటి పరిస్థితిలో ఉన్న లక్ష్మికి జనసైనికులు తోడుగా నిలిచారు. ఆమెకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, వస్త్రాలు ఆదివారం జనసైనికులు అదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లింగంపల్లి జ్యోతి కుమార్, శీను, బత్తిన కొండలరావు, గొర్ల కృష్ణ, కొర్ర వీరబాబు, సారిపల్లి రమణ, అల్లు అప్పలరాజు, సారిపల్లి అశోక్, కొర్ర గోవింద్, కిషోర్ కె అశోక్ పాల్గొన్నారు.

జనసేన బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని గొలుగొండ మండల జనసేన సీనియర్ నాయకులు దుంగలపూడి సహదేముడు, లింగంపేట ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ కోరారు. ఆదివారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొంగసింగి సీనియర్ నాయకులు మణిబాబు, గుణశేఖర్, నాగాపురం గ్రామ దుంపలపూడి సత్యనారాయణ, గలాసుల చిన్ని, కృష్ణదేవిపేట స్కూల్ కమిటీ చైర్మన్ గోపి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 ఏ (హెచ్) ప్రకారం ప్రజలందరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ సూచించారు. నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే సందర్భంగా ఆదివారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో నరేంద్ర దబోల్కర్ జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దబోల్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యావంతులైనప్పటికీ మూఢ నమ్మకాల పేరుతో కన్న బిడ్డలనే చంపుకునే పరిస్థితిని మనం చూస్తున్నామని, ఇందుకు మదనపల్లి సంఘటన ఉదాహరణ అన్నారు. ఏపి ప్రభుత్వం మూఢనమ్మకాలు నిర్మూలన చట్టం తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.దమయంతి, జెవి.వి నాయకులు కె.త్రిమూర్తులు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు,

మాట్లాడుతున్న నేతలు

టిడిపి నేతల సంబరాలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో శనివారం జరిగిన ఉప ఎన్నికలలో విజయం సాధించడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. టిడిపి రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, పొలింగ్ బ్యూరో సభ్యురాలు అనిత మాట్లాడుతూ, త్వరలో సైకో పాలనా పోయి బాబు పాలన వస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు. మండల పార్టీ అధ్యక్షులు అబద్ధం పాల్గొన్నారు.

27న చలో గాజువాక

ప్రజాశక్తి రావికమతం: ఈనెల 27న చలో గాజువాక సభను విజయవంతం చేయాలని చేనేత సంఘం జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో మండలం చేనేత కార్మిక సంఘం కార్యదర్శి ఉప్పు బాబ్జి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆనందప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 50 సంవత్సరములు నిండిన చేనేత కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించారన్నారు. నాలుగేళ్ల నుంచి 50 సంవత్సరములు పైబడిన చేనేత కార్మికులకు ఏ ఒక్కరికి పెన్షన్ సౌకర్యం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాజారావు, జిల్లా చేనేత సంఘ అధ్యక్షుడు మాడెం సూరిబాబు, రాష్ట్ర చేనేత సంఘం డైరెక్టర్ పప్పు రమణ, జిల్లా చేనేత సంఘం డైరెక్టర్ దొడ్డి సురేష్, మండల చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి యు బాబ్జి పాల్గొన్నారు.

నక్కపల్లి: 27న చలో గాజువాకను చేనేత కార్మికులు విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నక్కపల్లిలో సమావేశం నిర్వహించారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, జిల్లా అధ్యక్షులు మాడెం సూర్య అప్పారావు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కల్లూరి బాబ్జి , జాగు కొండబాబు, తెడ్డకు బాల, చంటి, మహేష్ మాడెం సూరిబాబు, వరహాలు, కల్లూరి సత్తిబాబు, మహేష్ , గుద్దటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ, వ్యాధులకు గురి కాకుండా దోమలను నిర్మూలించడం ఒక్కటే ఉత్తమమైన మార్గమని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు, మలేరియా ఇన్ ఛార్జ్ నోడల్ పర్సన్ పి ఎన్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి సుజాత, ఆరోగ్య విస్తరణ అధికారి బి.సత్యనారాయణ, పిహెచ్ఎన్ ఎంరత్న సఖి, హెల్త్ విజిటర్ ఎస్ సూర్యకుమారి, ఫార్మసిస్ట్ రీటా రత్నం పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

ప్రచారం చేస్తున్న అనిత, నాయకులు

రాజయ్యపేటలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఆదివారం తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో టిడిపి విడుదల చేసిన మహాశక్తి మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం హయాంలో ప్రజలకు సుపరిపాలన అందించారని గుర్తు చేశారు.అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించడం జరిగిందన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేసారు.తెలుగుదేశం పార్టీ మత్స్యకారులకు అండగా నిలిచి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు వినోద్ రాజు, లాలం కాశీనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు , పిక్కి శ్రీనివాసరావు, గంగరాజు, తాతారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల విలువైన విద్యా సామగ్రి

సిపిఎం ఆధ్వర్యాన పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని ఆర్ల పంచాయతీ కొండశిఖర గ్రామం నీలిబంద, పిత్రిగడ్డ గ్రామంలో 18మంది విద్యార్థులకు రూ.20వేల విలువ గల పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్స్‌పే మాతృభూమి సేవ(అమెరికా) డాక్టర్ శ్రీకాంత్ సహకారంతో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, ఆధునిక సమాజంలో విద్య ప్రతీ ఒక్కరికి అవసరమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ ప్రత్యామ్నాయ స్కూల్ ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న సిపిఎం నేత గోవిందరావు